బెంగళూరు - తిరుచినాపల్లి మధ్య ప్రత్యేక రైలు

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు - తిరుచినాపల్లి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును నడుపనున్నారు. ఈ మేరకు నైరుతి రైల్వేజోన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 06577 నెంబరు ప్రత్యేక రైలు బెంగళూరు ఎస్ఎంవీటీ నుంచి ఈ నెల 12న మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరుతుంది. అదే రోజు రాత్రి 11.30కు తిరుచినాపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 06578 నెంబరు రైలు తిరుచినాపల్లిలో 13న ఉదయం 4.45కు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు బెంగళూరుకు చేరుకోనుంది. ఇది బంగారుపేట, సేలం, నమక్కల్, కడూరు, తిరుచినాపల్లి కోట స్టేషన్లలో ఆగుతుందన్నారు.

గ్యారెంటీల అమలుకు...

- రాష్ట్ర, జిల్లా, తాలూకాల స్థాయిలో కమిటీలకు రూ.16 కోట్లు
- 3500 మంది కార్యకర్తలకు పదవులు కట్టబెట్టే వ్యూహం
- సక్రమ అమలుకు పర్యవేక్షణ

ప్రత్యేక కమిటీలు

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఐదు గ్యారెంటీలతో ప్రజలకు దగ్గరైంది. అనూహ్యమైన మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఐదు గ్యారెంటీలలో శక్తి, గృహలక్ష్మి, గృహజ్యోతి, అన్నభాగ్య అమలులో ఉన్నాయి. మరో కీలకమైన యువనిధి గ్యారెంటీకి మరో రెండు రోజుల్లో దరఖాస్తు స్వీకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గ్యారెంటీల అమలుకు పల్లె నుంచి రాష్ట్రస్థాయి దాకా పర్యవేక్షణ కోసం క్రియాశీల కార్యకర్తలకు కీలకమైన బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమయ్యారు. మరో మూడునెలలో జరిగే లోక్‌సభ ఎన్నికల వేళ కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేసేందుకు పదవులను కట్టబెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. మూడు వేల మందికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలు, ముఖ్యనాయకులకు పదవులు వరించనున్నాయి. నియోజకవర్గ, జిల్లా స్థాయితో పాటు రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేయడానికి సన్నాలు చేస్తున్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య బుధవారం కేపీసీసీలో జరిగిన సభ అనంతరం రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సూర్జేవాలాతో కలిసి మీడియాకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో అధ్యక్షుడికి కేబినెట్ మంత్రి హోదా కల్పిస్తామన్నారు. ఐదుగురు ఉపాధ్యక్షులకు స్టేట్ మంత్రి స్థాయి హోదా ఉంటుందన్నారు. రాష్ట్ర కమిటీలో ప్రతి జిల్లాకు ఒక సభ్యుడి ప్రకారం 31 మంది ఉంటారని చెప్పారు. రాష్ట్రంలోని 31 జిల్లాలకు ఒక అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడితో పాటు కనీసం 21 మంది సభ్యులు ఉంటారన్నారు. ఇక 224 నియోజకవర్గాలలోను కమిటీలు ఏర్పాటు చేస్తామని అధ్యక్షుడితో పాటు 11 మంది సభ్యులు ఉంటారన్నారు. జిల్లా స్థాయి కమిటీలకు ప్రత్యేకంగా ఆఫీసు సౌలభ్యం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి స్థాయిలోని కమిటీ సభ్యులకు నెలసరి గౌరవ వేతనంతో పాటు సిట్టింగ్ ఫీజులు చెల్లిస్తామని అన్నారు. ఇందుకోసం రూ.16కోట్లు కేటాయించామని తెలిపారు. గ్యారెంటీ పథకాలు సక్రమంగా అమలుతో పాటు అసత్య ప్రచారాలు చేసేవారికి తిపికొట్టేలా కమిటీ సభ్యులు పనిచేస్తారని అన్నారు. నియోజకవర్గాల స్థాయిలో కీలకులకు హోదాలు కల్పిస్తామని వివరించారు. వివిధ శాఖల కమిటీలను రూపొందించేలా సంబంధిత మంత్రులకు సూచించామన్నారు. కమిటీల ఏర్పాటు వేళ స్థానిక ఎమ్మెల్యేలదే తుదినిర్ణయంగా ఉంటుందన్నారు. కమిటీలు రెండేళ్లపాటు పనిచేస్తాయన్నారు.



కేపీసీసీ కార్యాలయం

అసంతృప్తుల బుజ్జగింపు కోసమే...

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడునెలలు ముగుస్తోంది. మరో మూడునెలల్లోగానే లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. శాసనసభ ఎన్నికల వేళ గ్యారెంటీ పథకాలు ప్రజలను విశేషంగా ఆకర్షించి అనూహ్యమైన మెజారిటీకి కారణమయ్యాయి. కానీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతిస్థాయిలోను అసంతృప్తి రగులుతోంది. ఎమ్మెల్యే టికెట్లు రాని వారు రగిలిపోతున్నారు. ఇక ప్రభుత్వం ఏర్పడ్డాక మంత్రి హోదా దక్కుతుందని భావించిన సీనియర్లను బుజ్జగించేందుకు కసరత్తు సాగుతూనే ఉంది. అధికారం మాదే అని చెప్పుకుంటున్న నియోజకవర్గ స్థాయి నాయకులు అప్పులు పాలయ్యాం అంటూ ఎమ్మెల్యేల వద్ద గగ్గోలు పెట్టే పరిస్థితులు నెలకొన్నాయి. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ అసంతృప్తులను బుజ్జగించే ప్రక్రియ ప్రభుత్వం ఏర్పడిన రెండోనెల నుంచే ప్రారంభించారు. సీనియర్‌నేత టీబీ జయచంద్రను ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధిగాను, అజయ్‌సింగ్‌కు కల్యాణకర్ణాటక అభివృద్ధి మండలి చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే. తాజాగా సీఎం సలహాదారులుగా సీనియర్‌నేతలు బసవరాజరాయరెడ్డి, ఆర్‌వీ దేశ్‌పాండే, బీఆర్ పాటిల్‌ను నియమించారు. గతంలో వీరు మంత్రులుగా వ్యవహరించిన వారే. ఇటీవల చోటు లభించకపోవడంతో రాయరెడ్డి, బీఆర్‌పాటిల్ పలు అంశాలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడారు. ఆర్‌వీ దేశ్‌పాండే కొన్నినెలల పాటు మౌనంగా ఉండిపోయారు. వీరిని బుజ్జగించేందుకే సలహాదారులనే పదవులు తెరపైకి తెచ్చారు. ప్రస్తుతం గ్యారెంటీల అమలు పర్యవేక్షక కమిటీ సభ్యులుగా వేలాది మంది పదవుల ద్వారా సంతోషపెట్టదలచారు. రాష్ట్ర స్థాయిలో అధ్యక్షుడితో పాటు ఐదుగురు ఉపాధ్యక్షులు, 31 మంది సభ్యులు, 31 జిల్లాలకు అధ్యక్షుడితో పాటు 11 మంది సభ్యులతో కలిపితే 700 మందికిపైగా ఉంటారు. ఇక 224 శాసనసభ నియోజకవర్గాల అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు 11 మంది సభ్యులు కలిపితే ఏకంగా 2700ల మంది దాకా ఉంటారు. ఇలా 3500 మంది కార్యకర్తలకు హోదాలు కట్టబెట్టదలచారు.

బీజేపీ హయాంలో ఆర్థిక పరిస్థితి

అధోగతి

- గత సర్కారుపై నిప్పులు చెరిగిన సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత బీజేపీ ప్రభుత్వం అధోగతి పాలు చేసిందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆరోపించారు. కేపీసీసీ కార్యాలయంలో బుధవారం జిల్లా కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు, ఇన్‌చార్జ్ మంత్రుల సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ బీజేపీ హయాంలో చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను సరిదిద్దేందుకు కనీసం ఏడాది సమయం పడుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదలశాఖలో రూ.13వేల కోట్లు, ప్రజాపనులశాఖలో రూ.9వేల కోట్లు, చిన్నతరహా నీటిపారుదలశాఖలో రూ.2వేల కోట్లు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖలో రూ.6వేల కోట్లు, బెంగళూరు నగరంలో వివిధ పనులకు సంబంధించి రూ.5వేలకోట్ల మేరకు బిల్లు బకాయిలను వదిలేసి వెళ్లారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై సహజంగానే దీని ప్రభావం పడుతోందన్నారు. అయినా ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీ హామీలను ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ అమలు చేస్తున్నామని తెలిపారు. వీటి ఫలాలు 4.30 కోట్ల మంది ప్రజలకు అందుతున్నాయన్నారు. ఏటా ఇందుకు రూ.59వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గర్వంగా ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీజేపీ అక్రమాలు, కుంభకోణాలు చెప్పుకుంటే చాంతాడంత ఉన్నాయని అన్నారు. స్వయంగా ఆ పార్టీ ఎమ్మెల్యే యత్నాళ్ వీటిని ప్రజల ముందు ఉంచారని గుర్తు చేశారు. 28 లోక్‌సభ స్థానాలకుగాను కనీసం 26 నియోజకవర్గాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కలసికట్టుగా ప్రజల్లోకి వెళ్దామన్నారు. ఈ పథకాల ప్రయోజనాల ద్వారా గరిష్ఠంగా రాజకీయలబ్ధి పొందాల్సిన బాధ్యత నేతలు, కార్యకర్తలపై ఉందన్నారు. అంతకుముందు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా మాట్లాడుతూ ఎవరికి టికెట్ ఇచ్చినా ఐక్యతతో పనిచేసి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ముఖ్యమంత్రులు వీరప్పమొయిలీ, జగదీశ్‌శెట్టర్, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులంతా పాల్గొన్నారు.



జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఇన్‌చార్జ్ మంత్రుల సమావేశాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

రాముడిపై బీజేపీది బోగస్ భక్తి

- దేవుడి పేరుతో రాజకీయం
- మంత్రి మంకాళ వైద్య



బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరం అంశాన్ని ప్రతిసారి బీజేపీ తన రాజకీయ ప్రయోజనాలకోసం వాడుకుంటూ వస్తోందని, రాముడిపై బీజేపీది బోగస్ భక్తి అని మంత్రి మంకాళ వైద్య వ్యాఖ్యానించారు. ఉత్తర కన్నడ జిల్లా కార్వారలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ బీజేపీకి మూడు ప్రధాన అజెండాలు ఉన్నాయని, అవి పచ్చి అబద్ధాలు ప్రచారం చేయడం, మతాల మధ్య చిచ్చుపెట్టడం, దేవుడి పేరుతో రాజకీయం చేయడమే అన్నారు. రామమందిరం ఇంకా ప్రారంభం కాకపోయినా దేశవ్యాప్తంగా ప్రజలకు అక్షింతలు పంచిపెడుతున్నారని, పైగా మోదీ ఫొటోను కూడా వాడుతున్నారని, పలు చోట్ల ఆయన కటౌట్లు వెలిశాయని తెలిపారు. రామ మందిరం అంశాన్ని బీజేపీ రాజకీయం చేసిందనడానికి ఈ ఉదాహరణలు చాలని పేర్కొన్నారు. రాముడిపై బీజేపీది బోగస్ భక్తి అని ప్రజలు త్వరలోనే ఈ విషయం తెలుసుకుంటారని మంత్రి వ్యాఖ్యానించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా హిందూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరపాలని తమ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వీటిలో బీజేపీ, జేడీఎస్ నేతలు కూడా పాల్గొనవచ్చు అన్నారు.

రాష్ట్రం నుంచి అయోధ్యకు 11 ప్రత్యేక రైళ్లు

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో నిర్మించిన చారిత్రాత్మక రామాలయాన్ని దర్శించుకునే భక్తుల కోసం రాష్ట్రం నుంచి 11 ప్రత్యేక రైళ్లు ఫిబ్రవరి నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీరామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 22న జరగనుంది. బాలరామ (రామలల్లా) విగ్రహాలకు పూజలు చేసి రామమందిరాన్ని దర్శించుకునేందుకు కోట్లాది మంది భక్తులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రం నుంచి 11 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్నారు. కర్ణాటక - గోవా నుంచి రెండు రైళ్లు బయల్దేరనుండగా, కర్ణాటక నుంచి అయోధ్యకు నేరుగా మిగిలిన 9 రైళ్లు సంచరించనున్నాయి. ఈనెల 31 తర్వాత ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఆన్‌లైన్ ద్వారా టికెట్లను బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించింది. ఆన్‌లైన్ మినహా నేరుగా టికెట్లు విక్రయించే వెసులుబాటు ఉండదు. అయోధ్యలో రైళ్లు నిలిపేందుకు అనుగుణంగా ఏ రాష్ట్రం నుంచి ఎన్ని రైళ్లు సంచరించాలో నిర్ణయించారు. ఈ మేరకు కర్ణాటక నుంచి 11 రైళ్లకు అవకాశం లభించనుంది.



బీదర్ నుంచి అయోధ్యకు సైకిల్ యాత్ర

రామమందిర ప్రారంభాన్ని తిలకించేందుకు వినూత్నంగా ప్రయాణించాలని భావించిన బీదర్ జిల్లా యువకుల బృందం సైకిళ్లపై బయల్దేరింది. డిసెంబరు 25న బయల్దేరిన ఈ బృందం జనవరి 22 నాటికి అయోధ్యకు చేరనుంది. రాముడిపై భక్తితో బీదర్‌లోని చిద్రి రోడ్డుకు చెందిన హనుమాన్ సేవా యువబృందం ఈ యాత్రకు బయలుదేరింది. వీరు 1300 కిలోమీటర్ల దూరాన్ని సైకిళ్లపై ప్రయాణించనున్నారు. బయల్దేరినవారిలో అజయ్‌శర్మ, విజయ్‌శర్మ, ఉదయ్‌శర్మ, భవనేశ్, అంబరీశ్, జగదీశ్, విష్ణు, అభిషేక్, సాయినాథ్ ఉన్నారు. వారణాసికి వెళ్లి కాశీ విశ్వనాథుడుని దర్శించుకుని అయోధ్యకు వెళతారు. ప్రస్తుతం వీరు మధ్యప్రదేశ్ రాష్ట్రం అమర్‌పఠాన్ ప్రాంతంలో వెళుతున్నారు. ఇప్పటికే 850 కిలోమీటర్ల మేరకు సైకిల్ సవారీ చేశారు. ఈ మేరకు అజయ్‌శర్మ, విజయ్‌శర్మ బుధవారం బీదర్‌కు చెందిన మీడియాతో ఫోన్‌లో మాట్లాడుతూ ప్రయాణం సజావుగా సాగుతోందని, అయితే చలి, మంచు ఎక్కువగా ఉన్నందున కొంత ఇబ్బందికరంగా ఉందని, అయినా ప్రయాణం సాగుతోందని తెలిపారు.

బళ్లారి మేయర్ పీఠంపై శ్వేత

- ఎట్టకేలకు ముగిసిన ఎన్నిక
- నామినేషన్ ఉపసంహరించుకున్న మించు శ్రీనివాసులు, కుబేరా
- కాంగ్రెస్ అభ్యర్థికి 29, బీజేపీ అభ్యర్థికి 12 ఓట్లు

బళ్లారి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పలుసార్లు వాయిదాలు పడుతూ వచ్చిన బళ్లారి మేయర్ ఎన్నిక నాటకీయ పరిణామాల మధ్య బుధవారం ఎట్టకేలకు ప్రశాంతంగా ముగిసింది. మేయర్‌గా 31వ వార్డు కార్పొరేటర్ బి. శ్వేతసోముకు కాంగ్రెస్ అధిష్ఠాన పట్టం కట్టింది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న 26 మంది కార్పొరేటర్లతో సహా మంత్రి బి. నాగేంద్ర, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఎంపీ నాసీర్ హుసేన్ కలసికట్టుగా నగర పాలికె వద్దకు చేరుకున్నారు. బీజేపీలో ఉన్న కార్పొరేటర్లు 13 మందిలో 12 మంది హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ విప్ జారీ చేసింది. అంతకు ముందు మేయర్ పదవి కోసం కార్పొరేటర్లు మించు శ్రీనివాసులు, కుబేరా, బి. శ్వేత సోము, బీజేపీ నుంచి ఒకటో వార్డు కార్పొరేటర్ గుడిగంట హనుమంతప్ప నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేషన్ వేసిన మించు శ్రీనివాసులు, కుబేరాను పార్టీ పెద్దలు విత్ డ్రా చేయించారు. పోటీలో కాంగ్రెస్ అభ్యర్థిగా బి. శ్వేతసోము, బీజేపీ నుంచి గుడిగంట హనుమంతప్ప ఉన్నారు. చేతులు ఎత్తే పద్ధతి ద్వారా ఎన్నికలు నిర్వహించగా కాంగ్రెస్ అభ్యర్థికి 29 మంది, బీజేపీ అభ్యర్థికి 12 మంది మద్దతు తెలిపారు. కాంగ్రెస్ తరపున మేయర్ స్థానానికి పోటీ చేసిన బి. శ్వేతసోము విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి కృష్ణా బాజ్‌పేయి ప్రకటించారు. అంతక ముందు రాత్రి కాంగ్రెస్‌లో పెద్ద రాజకీయ హైడ్రామానే నడిచింది. మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి 'ఐకమత్యం' ఫార్ములాతో హైడ్రామాకు తెరదించారు. అనంతరం మేయర్‌గా ఎన్నికయిన శ్వేతను మంత్రి బి. నాగేంద్ర, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఎంపీ నాసీర్ హుసేన్, కార్పొరేటర్లు, అధికారులు అభినందించారు. మేయర్ శ్వేత మాట్లాడుతూ తనకు ఉన్న రెండు నెలల అవధిలో బళ్లారిలో అనేక అభివృద్ధి పనులు చేస్తామని పేర్కొన్నారు. మంత్రి నాగేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య ఎటువంటి భేదాభిప్రాయాలు లేవని పేర్కొన్నారు. ఎమ్మెల్యే భరత్‌రెడ్డికి, తనకు ఎటువంటి విభేదాలు లేవన్నారు. ఎంపీ నాసీర్ హుసేన్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చిన్న చిన్న విబేధాలు ఉన్నా సర్దుకుపోతాయన్నారు.





నూతన మేయర్‌కు అభినందనలు తెలుపుతున్న మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి

కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు

మేయర్ ఎన్నిక సందర్భంగా బుధవారం బళ్లారి నగర పాలికె కార్యాలయం వద్ద పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికలు జరిగే చోటుకు ఎవరూ వెళ్లకుండా గట్టి భద్రత కల్పించారు. కార్పొరేటర్లు, నగర పాలికె అధికారులు, మీడియా ప్రతినిధులు ఇలా.. అందరూ ఖచ్చితంగా ఐడీ కార్డు ధరించి ఉండాలని సూచించారు. మొత్తం మీద బళ్లారి మేయర్ ఎన్నికల ప్రశాంతంగా ముగిసింది.

కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ఈనెల 22న జరిగే రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనరాదంటూ కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం తమకు ఏమాత్రం ఆశ్చర్యం కలిగించలేదని బీజేపీ పేర్కొంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర నగరంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ తన నిజస్వరూపాన్ని దేశ ప్రజల ముందు ఉంచిందన్నారు. రాముడి ఉనికినే ప్రశ్నించిన కాంగ్రెస్ బాబ్రీమసీదు విధ్వంసం జరిగిన సమయంలో ఐదు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలను డిస్మిస్ చేయడమే కాకుండా రామభక్తులను పలురకాలుగా వేధించిందని విమర్శించారు. ఈనెల 22న రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజల కార్యక్రమాన్ని కూడా కాంగ్రెస్ రద్దు చేసే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మైనారిటీ బుజ్జగింపు రాజకీయాల్లో కాంగ్రెస్ పీకల్లోతు మునిగి తేలుతోందని ఎద్దేవా చేశారు. గణతంత్ర దినోత్సవ శకటం విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరగలేదని, గత 14 సంవత్సరాలపాటు వరుసగా అవకాశం కల్పించారని, ఇతర రాష్ట్రాలకు చాన్స్ ఇవ్వాలనే ఉద్దేశ్యంతోనే నిరాకరించారని తెలిపారు. దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. అంతకు ముందు నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో రోజంతా లోక్‌సభ ఎన్నికల వ్యూహాలు, అభ్యర్థుల కసరత్తు వంటి అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రముఖనేతలంతా ఈ సమావేశానికి హాజరయ్యార




సమావేశంలో పాల్గొన్న బీజేపీ ప్రతినిధులు, ప్రసంగిస్తున్న విజయేంద్ర

సంగీతాలో 'సూపర్ పవర్ రెడ్ మి నోట్ 13' విడుదల

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మొబైల్ వినియోగదారులు ఎదురు చూస్తున్న 'సూపర్ పవర్ రెడ్‌మి నోట్ 13' మొబైల్ 5జీ సిరీస్‌ను యలహంక సంగీతా షోరూంలో లాంఛనంగా విడుదల చేశారు. బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో షియోమి ఇండియా హెడ్ సాజు రత్నం మాట్లాడుతూ మొబైల్ ఫోన్ల రిటైల్ రంగంలో సంగీతా విశేష ఆదరణ పొందిందని పేర్కొన్నారు. 5జీ సిరీస్ కొత్త నోట్ 13 ఫోన్ కోసం వినియోగదారులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. రెడ్‌మి ఫోన్ల పట్ల అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారని, 5జీ సిరీస్‌తో అత్యాధునిక ఫీచర్లు కలిగి ఉందన్నారు. సంగీతా మొబైల్స్‌తో కొనసాగుతున్న భాగస్వామ్యాన్ని ప్రత్యేక అనుభూతిగా భావిస్తున్నానని పేర్కొన్నా రు. వారి వ్యాపారశైలిని ప్రశంసించారు. సంగీతాతో తమ అనుబంధం నిరంతరమని తెలిపారు. కొత్త సిరీస్‌లో రెడ్‌మి నోట్ 13, నోట్ 13 ప్రొ, నోట్ 13 ప్రొ ప్లస్ మోడల్స్ ఉన్నాయన్నారు. ఇవి ఫింగర్‌ప్రింట్ సెన్సార్‌తో కూడిన సున్నితమైనవని తెలిపారు. 5000 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం కాగా 20 నిమిషాల్లోనే వందశాతం ఫాస్ట్ చార్జింగ్ కానుందని వివరించారు. ఆకట్టుకునే స్క్రీన్‌తోపాటు 200 ఎంపీ లెన్స్ కెమెరాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సంగీతా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



సూపర్ పవర్ రెడ్‌మి నోట్13 విడుదలలో ప్రముఖులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.99	1,622.45
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	8,493
సామర్థ్యం (టీఎంసీలు)	10.21	68.47

ఉత్కంఠ మధ్య మేయర్ ఎన్నిక

- రాజకీయ చాణక్యం చూపిన మంత్రి నాగేంద్ర..
- అధిష్టానం ఆదేశం మేరకే విత్‌డ్రా చేసుకున్నామన్న మించు శ్రీనివాసులు, కుబేరా
- ఎన్నిక ముందు రోజు రాత్రి మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, ఎంపీ నాసీర్ మంతనాలు ఫలించాయా?

బళ్లారి, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : బళ్లారి మేయర్ ఎన్నిక రాజకీయం చివరి వరకూ ఉత్కంఠను రేకెత్తించింది. గతేడాది నవంబరు 4 నుంచి కొత్త మేయర్ అయ్యేందుకు ఆశావహులు తీవ్ర ప్రయత్నాలే చేశారు. కాంగ్రెస్ పార్టీలో మేయర్ కావడానికి కావాల్సినంత కార్పొరేటర్లు ఉన్నా.. నాయకుల్లో ఆధిపత్య పోరు తీవ్ర స్థాయికి చేరింది. మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, ఎంపీ నాసీర్ హుసేన్ వారి అనుయాయులు మేయర్ పదవి దక్కించుకునేందుకు ఆశప డ్డారు. దాదాపు రెండు నెలలుగా రాజకీయ హైడ్రామానే నడిచింది. డిసెంబరు 19న మేయర్ ఎన్నిక జరపాలని నిర్ణయించారు. కానీ ఉన్నట్లుండి చివరి నిమిషాల్లో ఎన్నిక నిర్వహించే అధికారి రాలేక పోయారనే కారణంతో ఎన్నికను వాయిదా వేశారు. ఆరోజు ఎన్నిక వాయిదా వేసి డిసెంబరు 20న మరో ముహూర్తం పెట్టారు ఆరోజు కూడా ఎన్ఐఏ దాడులు అనే కారణం చెప్పి ఎన్నికలు వాయిదా వేయించారు. చివరకు ముచ్చటగా మూడో సారి బుధవారం మేయర్ ఎన్నిక జరిపారు. ఇందులో మంత్రి చెప్పిన కార్పొరేటర్ శ్వేత సోమునే మేయర్‌గా ఎన్నికయ్యారు. ప్రధానంగా రెండు దఫాలు ఎన్నిక వాయిదా వేయించడంలో మంత్రి పాత్ర ఉందని కార్పొరేటర్లు అప్పట్లో గట్టిగా ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఏర్పడిన గ్రూపు రాజకీయాలను తమకు అనుకూలంగా చేసుకోవాలని బీజేపీ, అలాగే కేఆర్‌పీపీ రెండు పార్టీలూ అనుకున్నాయి. వాస్తవానికి ఎస్సీ రిజర్వేషన్ కావడంతో మించు శ్రీనివాసులు, లేదా వాళ్ల అన్న కుబేరాకు అవకాశం దక్కుతుందని అనుకున్నారు. కానీ అనూహ్యంగా సోము భార్య శ్వేతను రంగంలోకి దింపారు. ప్రధానంగా సోము భార్య శ్వేతను మేయర్ చేయడానికి మంత్రి నాగేంద్ర మాట ఇచ్చారు. ఇక మించు శ్రీనివాసులు ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డికి ముఖ్య అనుచరుడు. అలాగే కుబేరాకు కూడా అవకాశం ఇవ్వాలని భావించారు. ఇలా రెండు సార్లు మించు శ్రీనివాసులు మేయర్ కాకుండా వాయిదా వేయించి చివరకూ మూడో సారి ఎన్నికలు జరిపి తన అనుయాయులకు మేయర్ పదవి దక్కించు కోవడంలో మంత్రి నాగేంద్ర తన రాజకీయ చతురత చాటుకున్నారని అంటున్నారు. వాస్తవానికి రెండు సార్లు తగ్గి మూడో సారి తన పట్టును మంత్రి పెంచుకుని విజయం సాధించారు. మంగళవారం రాత్రి, అలాగే బుధవారం ఉదయం ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మంత్రి నాగేంద్ర, ఎంపీ నాసీర్ హుసేన్ ముగ్గురూ కూర్చొని రాజకీయ రాజీ పడినట్లు తెలుస్తోంది. మేయర్ ఎన్నికలో గాలి జనార్దన్‌రెడ్డి పాత్ర కూడా ఉందని ఆ వర్గం బహిరంగంగా ప్రచారం చేస్తోంది. తన అనుకున్న వాళ్లకే మేయర్ పదవి దక్కించుకుని మంత్రి పట్టును నిలుపుకున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అసలు రెండు నెలల వ్యవధి ఉన్న మేయర్ పదవి కోసం ఇంత రాజకీయం అవసరమా? అనే విమర్శలు కూడా వ్యక్తం అవుతున్నాయి.



నూతనంగా ఎన్నికైన బళ్లారి మేయర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నాగేంద్ర

సరైన ఆహారంతోనే మంచి ఆరోగ్యం



ఆహారాన్ని రుచి చూస్తున్న న్యాయనిర్ణేతలు

బళ్లారి సిటీ, జనవరి 10: మంచి ఆరోగ్యం కోసం పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారం అవసరమని అయితే ఇటీవల పిల్లలు బయట తిండికి ఆకర్షితులవుతున్నారని, దీంతో వారి ఆరోగ్యం దిగజారుతున్నదని సిద్దరామకల్మఠ తెలిపారు. నగరంలోని కిత్తూరు రాణి చెన్నమ్మ బాలికల ఉన్నత పాఠశాల్లో బుధవారం ఏర్పాటు చేసిన వంటవార్పు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో ఈ తరహా వంటల పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో వంటలు నేర్చుకునే స్ఫూర్తి పెరుగుతుందన్నారు. మన పాత ఆహారతయారీ విధానం, ఇంటి వంటల గురించి అవగాహన కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ విద్యార్థులు స్వయంగా వివిధ రకాల వండగ తీపివంటలను తయారు చేశారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులకు సహకరించిన తల్లితండ్రులు వీణ, మంజునాథ్‌గౌడ, బసవరాజగౌడ, సదాశివ, కరూరు విరూపాక్షగౌడ, మహేశ్, న్యాయనిర్ణేతలు హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు కట్టెమ్మ, గిరిజ, తిప్పేరుద్ర తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యం వ్యాన్ పట్టివేత



రేషన్ బియ్యం వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

బళ్లారిరూరల్, జనవరి 10: తాలుకాలోని బళ్లారి బైపాస్ రూపనగుడి రోడ్డులో మంగళవారం రాత్రి బ్రూస్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సింధూర్ రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తుండగా వేగంగా పోతున్న వ్యాన్‌ను పట్టుకుని 203 రేషన్ బియ్యం బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2.10 లక్షలు వుంటుందని పోలీసులు తెలిపారు. బళ్లారికి చెందిన ఇర్ఫాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు బ్రూస్‌పేట పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొన్న బస్సు

- 14 మంది బళ్లారివాసులకు గాయాలు

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా ఏర్వాడి సమీపంలో బుధవారం వేకువజాము జరిగిన రోడ్డుప్రమాదంలో బళ్లారికి చెందిన అయ్యప్ప భక్తుడు మృతి చెందాడు. 14 మంది గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన 47 మంది అయ్యప్పభక్తులు సహా 49 మందితో ఓ టూరిస్టు బస్సు శబరిమలైకి వెళ్లింది. స్వామి వారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో మంగళవారం మధ్యాహ్నం రామేశ్వరానికి బయలుదేరారు. ఆ బస్సు ఏర్వాడి సమీపం పులంధై హైరోడ్డులో వెళుతుండగా అదుపు తప్పి రోడ్డు పక్కనే నిలిచి ఉన్న లారీని ఢీకొన్నది. ఈ సంఘటనలో బస్సు ముందు భాగం ధ్వంసమైంది. ముందుసీటులో కూర్చున్న బళ్లారికి చెందిన ప్రదీప్(25) ప్రాణాలు కోల్పోయాడు. మరో 14 మంది భక్తులు గాయపడ్డారు. ఏర్వాడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హొసపేటలో అతిసారం

- పారిశుధ్య చర్యలకు కలెక్టర్ ఆదేశాలు

హొసపేట, జనవరి 10: హొసపేట పట్టణ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా ప్రజలు అతిసార సమస్యతో బాధపడుతున్నారు. ప్రజలు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. దీంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విజయనగరం జిల్లాకలెక్టర్ దివాకర్ ఆదేశాలు జారీ చేశారు. నగర పరిధిలోని అన్ని హోటళ్లల్లో పరిశుభ్రత చర్యలు పాటించాలని పేర్కొన్నారు. హోటళ్లలో వినియోగదారులకు తాగడానికి వేడిచేసిన నీటిని అందించాలని, హోటళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహారంపై ఈగలు, వాలకుండా పరిశుభ్రత పాటించాలన్నారు.

ఇరుకు వంతెనే జేఎస్‌డబ్ల్యూ ఉద్యోగులకు దారి



- రోడ్డు మధ్యలో రైలు పట్టాలు అడ్డంగా ఉండడంతో వంతెన కింద నుంచి వెళుతున్న కార్మికులు

కంప్లి, జనవరి 10 : రాష్ట్రంలోనే అతిపెద్దదైన జేఎస్‌డబ్ల్యూ కర్మాగారానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ఉద్యోగులకు సరైన రోడ్డు వ్యవస్థ లేక ఇబ్బందులకు గురవుతున్నారు. వేలాది మంది పనిచేసే ఈ కర్మాగారానికి కుడితిని, సండూరు, సొసైటీ వైపు నుంచి వచ్చే ఉద్యోగులకు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ, గంగావతి, కంప్లి, కురుగోడు పట్టణాల నుంచి వెళ్లే ఉద్యోగులు మాత్రం నానాయాతన పడుతున్నారు. ముఖ్యంగా దరోజీ గ్రామం నుంచి కర్మాగారం కేవలం ఐదు కిలోమీటర్లు మాత్రమే వుండటంతో అక్కడ నుంచి జేఎస్‌డబ్ల్యూ కర్మాగారానికి వెళ్లడానికి సరైన రోడ్డు మార్గంలేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే తుకారామ్ రోడ్డయితే నిర్మించారు గాని కొంతదూరం తర్వాత రైల్వే ట్రాక్ అడ్డం రావడంతో పని అక్కడితో ఆగిపోయింది. దీంతో ఉద్యోగులు ప్రతినిత్యం అక్కడున్న ఇరుకైన వంతెన కింద నుంచి తమ విధులకు వెళుతున్నారు. రాత్రివేళల్లో కూడా ఈ ఇరుకైన వంతెన కిందే వెళ్లాల్సిరావడంతో ఎక్కడి నుంచి ఏ ప్రమాదం ఎదురవుతుందోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు రైల్వే ట్రాక్ పైన రోడ్డు ఏర్పాటు చేసి ప్రజలకు, రైతులకు, సండూరు తాలుకా వెళ్లే వారికి అనుకూలంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చిట్టిగ సమాజానికి 2ఎ సర్టిఫికెట్ ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న చిట్టిగ సమాజ పదాధికారులు

సిరుగుప్ప, జనవరి 10 : చిట్టిగ సమాజానికి 2ఎ సర్టిఫికెట్ ఇవ్వాలని చిట్టిగ సమాజం అధ్యక్షులు సుధాకర్ షాబాది ప్రభుత్వాన్ని కోరారు. సిరుగుప్ప పట్టణంలోని చిట్టిగ సమాజం వారు తమ డిమాండ్లను వివరిస్తూ బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ షాబాజీ మాట్లాడుతూ సిరుగుప్ప తాలుకాలో నాగలిక, చిట్టిగ సమాజం వారు టెక్కలకోట సమీప ప్రాంతాల్లో 200 కుటుంబాల వరకూ ఉన్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం చిట్టిగ సమాజానికి 2ఎ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొందరు ధ్రువీకరణ పత్రం ఇవ్వరాదని అభ్యంతరం తెలపడం హాస్యాస్పదంగా వుందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఈ 2ఏ ధ్రువీకరణ పత్రం అందించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ, ఈ విషయాన్ని అధికారులకు తెలిపి ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తామన్నారు. ఈ సందర్భంగా చిట్టిగ సమాజం ప్రముఖులు కందుగల్లు వీరణ్ణ, ప్రసాద్, మల్లయ్య, శివప్ప, గణేష్, మల్లికార్జున, నటరాజ తదితర సమాజ సభ్యులు పాల్గొన్నారు.

ఆలుమత సమాజం ముందడుగు వేయాలి

కంప్లి, జనవరి 10 : అన్ని సమాజాలతో పాటు ఆలుమత సమాజం వారు కూడా అన్ని రంగాల్లో ముందడుగు వేయాలంటూ ఆలుమత సమాజ గురుపీఠాధీశ్వరులు నిరంజన్ స్వామి తెలిపారు. కంప్లి పట్టణంలో ఆలుమత సమాజం కనకదాసు జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట పిల్లలకు శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే మనస్పర్థలు వదిలితేనే అభివృద్ధి చెందుతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే జేఎన్ గణేష్ మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికలను దీటుగా ఎదుర్కోవాలన్నారు. అలాగే ఆలుమత సమాజాన్ని ఎస్టీల్లో చేర్చేందుకు తమ వంతుగా సిఫారసు కూడా చేశామన్నారు. అంతకుముందు కనకదాసు జయంతిని పురస్కరించుకుని ముత్తయిదు మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హంపి విశ్వవిద్యాలయం ప్రముఖులు రవికుమార్, అధ్యక్షులు దిండే సమాజ ప్రముఖులు, పదాధికారులు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



బహుమతులతో విజేతలు

బళ్లారి సిటీ, జనవరి 10: నవభారత నిర్మాణానికి యువత అంకితమైనప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని శ్రీమేధ కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌కిరణ్ తెలిపారు. బళ్లారిలోని నెహ్రూ యువ కేంద్రం, శ్రీమేధ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో బుధవారం నాభారతం - వీక్షిత భారత అనే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమానికి నెహ్రూయువ కేంద్రం యువజన అధికారి పత్తర్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మైభారత్-వీక్షిత భారత్ కార్యక్రమం కింద జిల్లా స్థాయి వక్తృత్వపోటీలు నిర్వహించారు. పోటీలో చేత్రా ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభంకాని జొన్నల సేకరణ కేంద్రం

- పడిపోయిన సేకరణ ధర
- లబోదిబోమంటున్నరైతులు



జొన్న నూర్పిడి చేస్తున్న రైతులు

బళ్లారి సిటీ, జనవరి 10: బళ్లారి జిల్లాలోని వివిధ తాలూకాల్లో తాలూకాలో కొన్ని చోట్ల జొన్నకోతలు ప్రారంభమయ్యాయి. ఎకరాకు సగటున 20 క్వింటాళ్ల వరకు హైబ్రిడ్‌జొన్న దిగుబడి వస్తుందని రైతులు భావిస్తున్నారు. దీని ప్రకారం తాలూకాలో 20 లక్షల క్వింటాళ్ల వరకు జొన్న దిగుబడి వస్తుందని అంచనా. కాని విచిత్రంగా కోతలు ప్రారంభం కాగానే మార్కెట్‌లో ధర పడిపోయింది. వ్యాపారులు ఇప్పటివరకూ మార్కెట్లో క్వింటాల్ కనిష్టంగా రూ. 2,800నుండి గరిష్ఠంగా రూ.3000 వరకు కొనుగోలు చేస్తున్నారు. కాని కోతలు ప్రారంభంకాగానే హఠాత్తుగా క్వింటాల్ ధర రూ.500 నుంచి రూ.700 వరకు పడిపోయింది. జొన్నకొనుగోలు కేంద్రం తెరుచుకోకపోవడం వల్లనే ధరలు ఈ విధంగా నేలచూపులు చూస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆలస్యంగా ప్రారంభించిన ప్రతిసారి మద్దతు ధర రైతులకు అందడం లేదని, కేవలం వ్యాపారులకే మేలు జరుగుతోందని అంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం తెరిచే వరకు వేచి చూడలేక వ్యాపారులు నిర్ణయించిన ధరకే విక్రయించి రైతులు నష్టపోతున్నారు. వెంటనే ప్రభుత్వం తగిన గోదాం ఏర్పాటు చేసి మద్దతు ధరతో హైబ్రిడ్ జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని హళేకోట రైతు పంపన్న, శరణబసవ రైతులు కోరుతున్నారు.

రిపబ్లిక్ వేడుకలను ఘనంగా జరుపుకుందాం

సిరుగుప్ప, జనవరి 10 : రిపబ్లిక్ వేడుకలను ఘనంగా జరుపుకుందామని తహసీల్దార్ విశ్వనాథ్ పిలుపునిచ్చారు. తాలుకా పంచాయతీ భవనంలో బుధవారం జరగబోయే కార్యక్రమాల ఏర్పాట్లపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 19వ తేదీన యోగి వేమన జయంతి, 21న అంబిగర చౌడయ్య జయంతి, జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను ఎంతో ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు. యోగి వేమన జయంతి తాలుకా పంచాయతీ భవనంలో జరగనుంది. అంబిగర చౌడయ్య జయంతి సందర్భంగా ప్రధానవీధిలో ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలలో హైస్కూలు మైదానంలో జెండా ఎగురవేయడమే కాకుండా స్కౌడ్ గైడ్స్, విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు.

హొసూరు జోన్

పొంగల్ కిట్‌ల పంపిణీ



పొంగల్ బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

హొసూరు(మత్తిగిరి) జనవరి 10: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాలతో చౌక దుకాణాల ద్వారా రేషన్‌కార్డుదారులకు బుధవారం వెయ్యి రూపాయల నగదు, కిలో బియ్యం, కిలో చక్కెర, చెరుకు గడలతో కూడిన కిట్‌లను పంపిణీ చేశారు. ఆవలపల్లి హడ్కో ప్రాంతంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో కృష్ణగిరి పశ్చిమ జిల్లా డీఎంకే కార్యదర్శి, ఎమ్మెల్యే వై.ప్రకాశ్, హొసూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సత్య, కృష్ణగిరి జిల్లా కలెక్టర్ సరయు, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, హొసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, కమిషనర్ స్నేహ పాల్గొన్నారు. ప్రజలు ఉత్సాహంగా పొంగల్ కిట్‌లను అందుకున్నారు. ఈ సందర్భంగా హొసూరు హెల్త్ కమిటీ ఛైర్మెన్ మాదేశ్వరన్, పన్నుల కమిటీ ఛైర్మెన్ చెన్నీరప్ప, మున్సిపాలిటీ డిప్యూటీ సెక్రటరీ గోపాలకృష్ణన్, కౌన్సిలర్లు, శ్రీనివాసులు, మమత సంతోష్, కృష్ణప్ప, హొసూరుల్లో కౌన్సిలర్లు పాల్గొన్నారు. జిల్లా నగర, ప్రాంతం, వార్డు నిర్వాహకులు, కౌన్సిలర్ల టీం, ఆర్గనైజర్లు, హొసూరు మహనగర వెస్ట్ వైస్ ఆర్గనైజర్లు, మండల పరిధిలోని పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లైసెన్స్ పొందేందుకు సహాయ కేంద్రం ఏర్పాటు

హొసూరు(క్రైం) జనవరి 10: కార్పొరేషన్ పరిధిలో వ్యాపారాల నిర్వహణకు అవసరమైన లెసెన్సులు పొందేందుకు ప్రత్యేక సహాయకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హొసూరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న అన్ని దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, పారిశ్రామిక సంస్థలు కార్పొరేషన్ వ్యాపార లైసెన్స్ పొందిన తర్వాత మాత్రమే పని చేయాల్సి ఉంటుందని కార్పొరేషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. లైసెన్సులు లేకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్న వారికి నోటీసులు జారీ చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టం ప్రకారం సీల్ వేసే అవకాశం ఉందని, కావున నిర్వాహకులు నిర్ణీత సమయంలో సహాయ కేంద్రంలో దరఖాస్తు సమర్పించి లైసెన్సులు పొందవచ్చునని ప్రకటనలో తెలిపారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

హొసూరు, జనవరి 10: హొసూరు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాలపై బుధవారం ప్రత్యేక అవగాహనా శిబిరం నిర్వహించారు. హొసూరులో ఓల్డ్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరిగిన కార్యక్రమానికి టౌన్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ బైక్ నడిపే వారందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అదేవిధంగా కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలన్నారు. బస్సుల్లో ఫుట్‌బోర్డ్ ప్రయాణం చేయరాదన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్‌లు ధరించిన వారికి గులాబీ పూలు ఇచ్చి ప్రత్యేకంగా అభినందించారు. హెల్మెట్లు ధరించని వారికి అవగాహన కల్పిస్తూ వారికి ఉచితంగా హెల్మెట్లు అందించారు. ట్రాఫిక్ నియమాలు మనం పాటిస్తేనే మన తర్వాతతరం వారు గమనించి ఆచరించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణన్, పోలీస్ కానిస్టేబుల్స్ చంద్రన్, వాసుదేవన్, పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రభుత్వ ఉద్యోగులు మరింత నిబద్ధతతో పని చేయాలి



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న లోకాయుక్త ఎస్పీ ఎంఎన్ శశిధర్

రాయచూరు, జనవరి 10: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సేవకులుగానే ఉండాలని ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం మరింత నిబద్ధతతో పని చేయాలని కర్ణాటక లోకాయుక్త జిల్లా ఎస్పీ ఎంఎన్ శశిధర్ అన్నారు. లోకాయుక్త ఆధ్వర్యంలో బుధవారం తాలూకా స్థాయిలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన లోకాయుక్త జిల్లా ఎస్పీ ప్రభుత్వ శాకలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా ఇలాంటి సమావేశాల ద్వార దరఖాస్తులను అందజేయాలన్నారు. ప్రతి నెల తాలూకా స్థాయి జిల్లాస్థాయి ఫిర్యాదుల దినాన్ని ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా వివిధ సమస్యల కోసం దరఖాస్తులు చేసి వాటికి తక్షణం పరిష్కారం చూపాలని అలా కాని పక్షంలో సంబంధిత శాఖకు వాటిని నివేదించి ప్రజలకు తగిన సమయంలో పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో ప్రభుత్వ పరంగా ప్రజలకు అందే సేవలు ఇతరత్ర సౌకర్యాలకు సంబంధించి అర్హులైన వారికి చేరేలా అధికార యంత్రాంగం పని చేయాలన్నారు.

మంత్రి భోసరాజుకు లోకసభ ఎన్నికల జిల్లా బాధ్యతలు

రాయచూరు, జనవరి 10 : వచ్చే లోకసభ ఎన్నికల్లో పార్టీ అనుసరించే కార్యక్రమాలకు సంబంధించి రాయచూరు జిల్లాకు చిన్ననీటి పారుదల, సైన్స్ అండ్ టెక్నాలజి మంత్రి ఎస్ఎస్ భోసరాజు నియమితులయ్యారు. పార్టీ అగ్ర నాయకత్వం సూచన మేరకు కేపీసీసీ అధ్యక్షుడు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ లోకసభ ఎన్నికలకు సంబంధించి జిల్లాల బాధ్యతలను మంత్రులకు అప్పగించారు. ఇటీవల ప్రకటించిన జాబితాలో కొంత మార్పులు చేసిన అనంతరం ముఖ్యమంత్రి సూచన మేరకు మంత్రులకు సొంత జిల్లాల బాధ్యతలనే అప్పగించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఎస్.ఎస్.భోసరాజుకు రాయచూరు బాధ్యతలను అప్పగించినట్లు తెలిసింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

కాంటె సీసర్ మాటె (జయంతి)



కాంటె సీసర్ మాటె 1809 జనవరి 11న ఇటలీ దేశం బోలోగ్న నగరంలో జన్మించారు. రోమ్ నగర పార్లమెంటు సభ్యుడిగా వ్యవహరించారు. తల్లి కేన్సర్‌తో మృతి చెందిన కారణంగా నేచరల్ మెడిసిన్‌తో పాటు పలు వైద్య అంశాలపై పరిశోధించారు. శామ్యూల్ హానెమన్ ప్రతిపాదించిన సూత్రాలను విస్తృతం చేసి 'ఎలక్ట్రో హోమియోపతి' (మాటె కేన్సర్ క్యూర్)గా అభివృద్ధి చేశారు. జీవిత పర్యంతం పేదల కోసం పాటుపడ్డారు. 1896 ఏప్రిల్ 3న కన్నుమూశారు.

మహమ్మద్ కులీ కుతుబ్ షా (వర్ధంతి)




మొహమ్మద్ కులీ కుతుబ్ షా 1565 ఏప్రిల్ 4న జన్మించారు. గోల్కొండ కుతుబ్ షాహి వంశానికి చెందిన ఐదవ సుల్తాన్. 15వ యేటనే సింహాసనాన్ని అధిష్ఠించి 31ఏళ్లపాటు పాలించారు. హైదరాబాద్ నగర నిర్మాత. చారిత్రాత్మక చార్మినార్, మక్కా మసీదులను నిర్మించిన ఘనత ఆయనదే. అరబ్బీ, పర్షియన్, ఉర్దూ, తెలుగు భాషలలో పాండిత్యం గలవారు. ఉర్దూ సాహిత్య జగతిలో 'దీవాన్' (కవితా సంపుటి)గల తొలి సుల్తాన్. 1612 జనవరి 11న కన్నుమూశారు.

లాల్‌బహదూర్ శాస్త్రి (వర్ధంతి)



దేశ రెండో ప్రధానిగా వ్యవహరించిన 'భారతరత్న' గ్రహీత లాల్‌బహదూర్ శాస్త్రి 1904 అక్టోబరు 2న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముఘల్‌సరాయ్ ప్రాంతంలో జన్మించారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. లోక్‌సేవా మండల్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. వ్యవసాయ విప్లవానికి బాటలు వేశారు. ప్రధానిగా క్షీరవిప్లవానికి నాంది పలికి జాతీయస్థాయి లో పాల డెయిరీ అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేశారు. ఆయన పిలుపునిచ్చిన 'జై జవాన్ - జై కిసాన్' అనే నినాదం నేటికీ స్ఫూర్తిగా ఉంది. 1965లో ఇండో-పాక్ యుద్ధానికి నేతృత్వం వహించారు. 1966 జనవరి 11న కన్నుమూశారు.

వి. మధుసూదనరావు (వర్ధంతి)



వీరమాచనేని మధుసూదనరావు 1917 జూలై 27న కృష్ణా జిల్లా పెయ్యేరులో జన్మించారు. సినీ దర్శకుడిగానేకాక నిర్మాత, స్క్రీన్ రైటర్‌గా రాణించారు. 45కు పైగా సినిమాలకు దర్శకత్వం వహించారు. అన్నపూర్ణ, జమీందారు, అంతస్థులు, ఆరాధన, ఆత్మబలం, స్వాతికిరణం వంటి సినిమాలు ఎంతో పేరొందాయి. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించి పలువురు కళాకారులను పరిచయం చేయడమే కాక రాఘవేంద్రరావు, కోదండరామిరెడ్డి, పీసీ రెడ్డి, బోయిన సుబ్బారావు తదితర అగ్ర దర్శ కులంతా ఈయన వద్ద శిష్యరికం చేసినవారే కావడం విశేషం. రఘుపతి వెంకయ్య అవార్డు, నంది, ఇతర పురస్కారాలు పొందారు. ఐదు దశాబ్దాలలో నాలుగు భాష లలో కలిపి 71 సినిమాలకు దర్శకత్వం వహించి 'విక్టరీ'ని ఇంటి పేరుగా మార్చుకున్నారు. 2012 జనవరి 11న కన్నుమూశారు.

రాహుల్ ద్రావిడ్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత రాహుల్ శరద్ ద్రావిడ్ 1973 జనవరి 11న మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో జన్మించారు. అనంతరం బెంగళూరుకు కుటుంబం మారింది. భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో సుమారు 25వేల పరుగులు చేసి గ్రేటెస్ట్ బ్యాట్స్‌మెన్‌లలో ఒకరిగా నిలిచారు. టెస్ట్‌క్రికెట్‌లో ట్రిపుల్ సెంచరీ (309) చేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందారు. అభిమానులచే 'మిస్టర్ డిపెండబుల్', 'ది గ్రేట్ వాల్'గా పిలవబడ్డారు. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో డైరెక్టర్‌గా కొనసాగుతూ అండర్-19, 'ఇండియా ఏ' జట్లను పర్య వేక్షించారు. ప్రస్తుతం క్రికెట్ జాతీయజట్టుకు ప్రధాన కోచ్‌గా ఉన్నారు. పద్మశ్రీ, అర్జున సహా డాన్ బ్రాడ్ మన్ అవార్డు, తదితర అవార్డులు పొందారు.

ఐటీఐ విద్యార్థి ఆత్మహత్య



మోహన్ (ఫైల్)

చింతామణి, జనవరి 10: పట్టణ శివారులోని మురగమల్లా రోడ్డు కరియపల్లి గ్రామ రైల్వే అండర్‌పాస్ సమీపాన ఒక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సరిహద్దులోని బాగేపల్లి తాలూకా మొతకలపల్లి గ్రామ నివాసి, ప్రస్తుతం మురగమల్లాలో ఉంటున్న నాగ రాజ్ కుమారుడు మోహన్ ఎంఎన్(19)గా గుర్తించారు. కోలారు రోడ్డులోని అరుణోదయ ఐటీఐలో చదువు తున్నట్టు తెలుస్తోంది. రైల్వే పట్టాలపక్కన పడి ఉండ డంతో బుధవారం ఉదయం స్థానికులు గమనించి చింతామణి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రేపు డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

మడకశిరటౌన్, జనవరి 10: పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బయ్య బుధవారం తెలిపారు. డిగ్రీ కళాశాల ఆవరణంలో దాదాపు 13 కంపెనీలు పాల్గొని జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. 18-35 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. పెనుకొండ కియ కంపెనీతోపాటు బెంగళూరుకు చెందిన పలుకంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్‌ఖయ్యుంతో కలిసి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలోనే 34 జయంతులు

» ప్రకటించిన కన్నడ సాంస్కృతిక శాఖ

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత ఏడాది పొడవునా పలువురు ప్రముఖుల జయంతి కార్యక్రమాలను ప్రభుత్వమే నిర్వహించనుంది. కన్నడ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఈ మేరకు జిల్లాధికారులకు బుధవారం లేఖలు రాశారు. ఏయే నెలలో ఎవరెవరి జయంతి కార్యక్రమాలను నిర్వహించాలనే అంశాన్ని స్పష్టంచేస్తూ ప్రత్యేక జాబితాను రూపొందించారు. జనవరిలో విశ్వకర్మ అమరశిల్పి చక్కణాచారి సంస్మరణా దినోత్సవం, శివయోగి సిద్ధరామ జయంతి, మహాయోగి వేమన జయంతి, అంబిగర చౌడయ్య జయంతి జరుగనున్నాయి. ఇక ఫిబ్రవరి నెలలో మడివాళ మాచిదేవ జయంతి, కాయక శరణర జయంతి, సంత్ సేవాలాల్ జయంతి, సవితా మహర్షి జయంతి, ఛత్రపతి శివాజీ జయంతి, కవి సర్వజ్ఞ జయంతి ఆచరిస్తారు. మార్చి నెలలో రేణుకాచార్య జయంతి, యోగి నారేయణ యతీంద్ర జయంతి, అగ్ని బన్నిరాయ జయంతి నిర్వహిస్తారు. ఏప్రిల్ నెలలో దేవర దాసీమయ్య జయంతి, భగవాన్ మహావీర్ జయంతి, అక్కమహాదేవి జయంతిని నిర్వహించనున్నారు. మే నెలలో బసవ జయంతి, శివశరణ హేమారెడ్డి మల్లమ్మ జయంతి, జూన్ నెలలో నాల్వడి కృష్ణరాజ ఒడయార్ జయంతి, కెంపెగౌడ జయంతి నిర్వహిస్తారు. జులై నెలలో ఫ.గు.హళకట్టి పుట్టిన రోజును పురస్కరించుకుని వచన సాహిత్య సంరక్షణా దినోత్సవం, హడపద అప్పణ్ణ జయంతిలను నిర్వహిస్తారు. ఆగస్టు నెలలో నులియ చందయ్య జయంతి, బ్రహ్మశ్రీ నారాయణగురు జయంతి, కృష్ణ జయంతి ఉంటాయి. సెప్టెంబరు నెలలో విశ్వకర్మ జయంతి, అక్టోబరు నెలలో కిత్తూరు రాణి చెన్నమ్మ జయంతి, నవంబరులో ఒనకె ఓబవ్వ జయంతి, కనక జయంతి, డిసెంబరులో కువెంపు యంతిని విశ్వ మానవ దినోత్సవంగా జరుపనున్నారు. ఈ జయంతి కార్యక్రమాలకు అయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని కన్నడ సాంస్కృతిక శాఖ ప్రకటించింది.

సాంకేతికతను అన్నదాతలు వినియోగించుకోవాలి

» మంత్రి సుధాకర్ పిలుపు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వ్యవసాయశాఖ మంత్రి చెలువరాయస్వామి

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతను అన్నదాతలు విరివిగా వినియోగించుకోవడం ద్వారా దిగుబడులను పెంచుకోవాలని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ పిలుపునిచ్చారు. నగరంలో సింధూరి ఆగ్రోటెక్ రజత మహోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇదే సందర్భంగా సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రయోగాత్మకంగా అమలు చేసి విజయం సాధించిన పలువురు రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ సంప్రదాయ వ్యవసాయ విధానంలో మార్పులు కాలానికి అనుగుణంగా ఉండాలన్నారు. వ్యవసాయశాఖ మంత్రి చెలువరాయస్వామి మాట్లాడుతూ దేశానికి వెన్నెముకగా ఉన్న రైతులకు ప్రభుత్వాలు అండదండగా ఉండాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. గత 25 సంవత్సరాలుగా సేంద్రీయ వ్యవసాయ పద్ధతులకు ఉత్తేజం కల్పిస్తున్న సింధూరి ఆగ్రోటెక్ నిర్వాహకులను అభినందించారు. రెవెన్యూశాఖ మంత్రి కృష్ణ బైరేగౌడ మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై ఆధారపడి లక్షలాదిమంది ఉపాధి పొందుతున్నారన్నారు. రానున్న రోజుల్లో వ్యవసాయం కూడా పరిపూర్ణ వాణిజ్యరూపాన్ని సంతరించుకోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సంస్థాపక చైర్మన్ కనగాల సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, అర్బన్ బ్యాంక్‌కు చెందిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో రైతు దినోత్సవం



అర్థవంతంగా రైతు దినోత్సవం ఇలా..

బంగారపేట, జనవరి 10: ప్రపంచ రైతు దినోత్సవాన్ని, ప్రముఖ రైతు నేత కేఎస్ పుట్టణ్ణయ్య జయంతిని రైతుసంఘం ఆధ్వర్యంలో తాలూకా కార్యాలయం వద్ద బుధవారం అర్థవంతంగా ఆచరించారు. ఆదర్శరైతులకు సన్మానం, పేదలకు కూరగాయలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి మాట్లాడుతూ చెప్పినట్టుగానే తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రైతుల రెవెన్యూ, అటవీ భూముల సమస్యలను పరిష్కరించేందుకు త్వరలోనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కరువు గ్రాంటు విడుదల చేయడంలో కేంద్రప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని, అయినా సంక్రాంతి పండుగకు రైతులకు రూ.2వేల పరిహారం సీఎం ఇవ్వనున్నారన్నారు. పారిశ్రామికవాడలు, లే అవుట్‌లకోసం వ్యవసాయ భూములను బలవంతంగా లాక్కుంటే రానున్న రోజుల్లో ఆహారం కోసం మూడోయుద్ధం తప్పదని ప్రముఖ నేత మరగల్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో రైతులు మూడేళ్లుగా సమస్యలు ఎదుర్కొంటున్నారని, గత ఏడాది అతివృష్టి కారణంగా రైతులు నష్టం చవిచూశారని, పరిశ్రమలకు మాఫీ చేసిన రీతిలోనే ఎటువంటి షరతులు లేకుండా పంటల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే నారాయణగౌడ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, సరైన మార్కెట్ వ్యవస్థను అభివృద్ధి చేయకపోతే రానున్న రోజుల్లో తీవ్ర పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో జిల్లాధ్యక్షుడు ఈకంబళ్ళి మంజునాథ, తాలూకా అధ్యక్షుడు అప్పోజిరావ్, మునికృష్ణ, గోవిందప్ప, మునియప్ప, సురేశ్ బాబు, రామసాగర వేణు, మంజునాథ, రత్నమ్మ, శైలజ, భాగ్యమ్మ, వెంకటమ్మ, మునియమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజకీయాలు ఉండవు



మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శిడ్లఘట్ట, జనవరి 10: జిల్లా అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని అభివృద్ధి పనుల్లో రాజకీయాల్లో ఉండరాదని, పార్టీలకు అతీతంగా జిల్లా తాలూకా ప్రజా ప్రతినిధులు సహకారం అందించాలని ఉన్నత విద్య, చిక్కబళ్ళాపుర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ పేర్కొన్నారు. తాలూకాలోని మళమాచనహళ్ళిలో 48మందికి హక్కుపత్రాల పంపిణీ , గ్రామీణ తాగునీరు పారిశుద్ధ శాఖ ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ కింద్ 69 గ్రామాల్లో రూ.43.65 కోట్లతో పనులను ప్రారంభించారు. ఇదే సందర్భంగా గ్రామపంచాయతీ గ్రంథాలయానికి భూమిపూజ చేసిన అనంతరం మాట్లాడారు. 15ఏళ్లపాటు స్థలాన్ని ఇతరులెవ్వరికి ఇవ్వరాదనే ఉద్దేశంతో హక్కుపత్రాల మూల పత్రాలను ఇవ్వలేదన్నారు. వాటికి సంబంధించిన అసలు డాక్యుమెంట్లు జిల్లా అధికారి, తహసీల్దార్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఉంటాయన్నారు. ఇంటింటికీ గంగ పథకానికి 45శాతం కేంద్రం, మిగిలిన 55శాతం రాష్ట్రప్రభుత్వం నిధులు భరిస్తోందన్నారు. మీటర్లు అమరుస్తారన్న భయం వద్దన్నారు. రానున్న రోజుల్లో గ్రామపంచాయతీ విచక్షణ మేరకు నిధులు సేకరిస్తామన్నారు. శిడ్లఘట్ట పట్టణ సమీపంలోని హనుమంతపుర వద్ద హైటెక్ పట్టుగూళ్ల మార్కెట్‌కు స్థలాన్ని ఎమ్మెల్యే రవికుమార్ గుర్తించారన్నారు. త్వరలోనే టెంటరు ప్రక్రియ జరగనుందని, రూ.170కోట్లు దశలవారీగా గ్రాంటు విడుదల కానుందన్నారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పథకానికి రూ.30కోట్లు నగరాభివృద్ధి మంత్రి బైరతి సురేశ్ గ్రాంటు విడుదల చేశారన్నారు. నగరోత్థాన పథకం కింద రూ.4.5 కోట్లు అంబేడ్కర్ భవన నిర్మాణానికి వినియోగించేందుకు ప్రస్తావన ఉందన్నారు. తాలూకాలోని అతిపెద్ద చెరువు రామసముద్ర చెరువు నుంచి పట్టణానికి నీరు అందించే పథకానికి సుమారు రూ.120కోట్లు అవసరమన్నారు. అందుకోసం కేసీ వ్యాలి నీటిని రామసముద్ర చెరువుకు విడుదల చేయలేదన్నారు. ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ ఎంతో సహకారం అందిస్తున్నారన్నారు. అంతకుముందు మంత్రిని గ్రామస్థులు పూర్ణకుంభంతో స్వాగతించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షురాలు భాగ్యమ్మ పాపణ్ణ, ఉపాధ్యక్షుడు లోకేశ్, తహసీల్దార్ బీఎన్ స్వామి, తాలూకా పంచాయతీ ఈఓ మునిరాజు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జడ్పీ మాజీ సభ్యుడు బంక్ మునియప్ప, పీడీఓ శైలజా తదితరులు పాల్గొన్నారు.

శివమొగ్గలో కేఎఫ్‌డీ వ్యాధితో యువతి మృతి

» మలెనాడు ప్రాంతంలో బెంబేలు

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మలెనాడు ప్రాంతమైన శివమొగ్గ జిల్లా వ్యాప్తంగా దశాబ్దాల కాలంగా అలజడి రేగిస్తున్న కోతి జ్వరంగా భావించే క్యాసనూరు ఫారెస్ట్ డిసీజ్ (కేఎఫ్‌డీ) జబ్బుకు ఓ యువతి మృతి చెందడం సర్వత్రా బెంబేలెత్తేలా మారింది. శివమొగ్గ జిల్లాలో ఇప్పటి దాకా ఇద్దరికి కెఎఫ్‌డీ ప్రబలగా ఈ ఏడాదిలో తొలి మృతి నమోదయ్యింది. శివమొగ్గ, చిక్కమగళూరు జిల్లాల వ్యాప్తంగా మలెనాడు అటవీ ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ కోతుల ద్వారా కేఎఫ్‌డీ వ్యాధి ప్రబలుతుందని నిర్ధారించారు. 2020 తర్వాత కెఎఫ్‌డీతో మృతి నమోదయినట్లు అయ్యింది. గత ఏడాది పలువురికి వ్యాధి ప్రబలినా అందరూ కోలుకున్నారు. ఇటీవల తీర్థహళ్ళి, హొసనగర ప్రాంతాలలో ఇరువురికి కెఎఫ్‌డీ ప్రబలింది. తీర్థహళ్ళి ప్రాంతంలో 26-27 కోతులు మృతి చెందాయి. మృతి చెందిన కోతులలో కెఎఫ్‌డీ వైరస్‌ను గుర్తించారు. హొసనగర తాలూకా అరమనెకొప్ప గ్రామానికి చెందిన యువతి బప్పనమనె అనన్య (18)కు జ్వరంతో పాటు ఇతరత్రా సమస్యలు వచ్చిన మేరకు స్థానికంగా చికిత్సలు అందించారు. తొలుత శివమొగ్గ మెడికల్ కళాశాల ఐసీయూలో చికిత్సలు అందించారు. కోతి జ్వరం లక్షణాలుగా డాక్టర్లుగా భావించారు. దీంతో యువతిని ఉన్నత చికిత్సల నిమిత్తం ఉడుపి కేఎంసీ ఆసుపత్రి తరలించారు. తొలిసారి నెగిటివ్ రాగా జ్వరం తగ్గకపోవడంతో రెండోసారి పరీక్షలు జరిపించగా పాజిటివ్‌గా తేలింది. దీంతో కెఎఫ్‌డీ వైరస్‌కు అనుగుణంగానే చికిత్సలు అందించారు. అవయవాల వైఫల్యంతో సోమవారం ఉదయం బాధిత యువతి మృతి చెందారు. శివమొగ్గ అటవీ ప్రాంతాలలో నివసించే వేలాది గ్రామాలకు చెందిన ప్రజలు భయపడుతున్నారు. మాజీ హోంమంత్రి అరగ జ్ఞానేంద్ర తదితరులు కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. కాగా ఇటీవల బెళగావిలో జరిగిన శాసనసభ శీతాకాల సమావేశాలలో కోతి జ్వరంను ఎదుర్కొనేలాంటి టీకాల తయారీకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమని వైద్యఆరోగ్యశాఖా మంత్రి దినేష్‌గుండూరావ్ ప్రకటించారు. దీనిని బట్టి శివమొగ్గ ప్రాంతంలో కోతిజ్వరంకు ఇంకా తగిన వైద్యవిధానమే లేనట్లు అయ్యింది. సమస్య ఈప్రాంతంలో దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఎప్పటికీ దీన్ని అడ్డుకట్ట పడనుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

జలజీవన్ మిషన్ పనులకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, తదితరులు

చేళూరు, జనవరి 10: తాలూకాలోని చిలకలనేర్పు గ్రామ పంచాయతీ పరిధిలోని హొసహుడ్యలో జలజీవన్ మిషన్ పనులకు చింతామణి ఎమ్మెల్యే డాక్టర్ ఎంసీ సుధాకర్, శిడ్లఘట్ట ఎమ్మెల్యే మేలూరు బీఎన్ రవికుమార్‌లు భూమిపూజ చేశారు. ఈ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు కల్పించ నున్నారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన ఈ పథకం ద్వారా ఎట్టకేలకు సాకారం కానుందన్నారు. ఏనిగదలె గ్రామపంచాయతీ అధ్యక్షురాలు శివమ్మ, చిల కలనేర్పు గ్రామ అధ్యక్షుడు ఆర్‌టీ ప్రసాద్, బురదగుంట గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు గాయత్రి భరత్‌కుమార్, చేళూరు రామచంద్రారెడ్డి, చిలకలనేర్పు గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మంజులా అరవింద లింబావళి

మహదేవపుర, జనవరి 10: నియోజకవర్గంలోని హూడి ప్రభుత్వ పీయూ కళాశాలలో క్రీడా వార్షికోత్సవం ఉత్సాహంగా జరిగింది. ఎమ్మెల్యే మంజులా అరవింద లింబావళి క్రీడా వార్షికోత్సవాన్ని, స్మార్ట్ తరగతులను బుధవారం లాంచనంగా ప్రారంభించారు. సాంకేతికతకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ఉత్తమ బోధనలు అందించే ప్రక్రియ చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థులను పరిశోధనలు ఇతర అంశాల పట్ల ప్రోత్సహించడం ద్వారా దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ గ్రామీణ అధ్యక్షుడు నటరాజ్, కబడ్డీ పిళ్ళప్ప, ప్రిన్సిపాల్ రాధ తదితరులు పాల్గొన్నారు.

201మందికి కొవిడ్ పాజిటివ్

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొవిడ్ కేసులు నిలకడగా సాగుతున్నాయి. బుధవారం 201మందికి పాజిటివ్ నిర్ధారణ కాగా బెంగళూరులో 121, తుమకూరులో 14, మైసూరులో 10మందికి కాగా మిగిలిన జిల్లాల్లో అంతకులోపు కేసులు నమోదయ్యాయి. 257మంది డిశ్చార్జ్ కాగా ఒకరు మృతి చెందారు. 974మంది చికిత్సలు పొందుతున్నారు. కాగా కొత్త వేరియంట్‌తో పెరుగుతున్న కేసులతో ఆందోళన వద్దని వైద్యులు అంటున్నారు.

అంతర్జాతీయ స్థాయికి కేఎంఎఫ్ ఉత్పత్తులు

» ఎండీ జగదీష్



మాట్లాడుతున్న కేఎంఎఫ్ ఎండీ ఎంకే జగదీష్

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చిన్నారుల్లో పౌష్టికాంశాలను పెంపొందించే దిశలో కర్ణాటక పాల సమాఖ్య (కేఎంఎఫ్) ప్రముఖ పాత్రను పోషిస్తుండటం ఎంతో సంతోషంగా ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎంకె.జగదీష్ పేర్కొన్నారు. నగరంలో ఏర్పాటైన గ్లోబల్ హెల్త్ సమ్మిట్ సిఇఓ ఫోరంను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కేఎంఎఫ్ ప్రతిరోజూ రాష్ట్రవ్యాప్తంగా 45 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తోందని ఇందులో 84 శాతం లాభాన్ని నేరుగా పాడి రైతులకే అందేలా చూస్తోందన్నారు. కొవిడ్ అనంతరం ప్రజల్లో ఆరోగ్య సంరక్షణపై ఆసక్తి బాగా పెరిగిందన్నారు. కర్ణాటక పాల సమాఖ్య తన మార్కెట్ పరిధిని విస్తరించుకుంటోందన్నారు. కేఎంఎఫ్ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో మరింతగా ప్రజాదరణ సాధించుకోవాలన్నదే తమ లక్ష్యమన్నారు.

సీఈటీ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వృత్తివిద్యాకోర్సులలో ప్రవేశానికై కర్ణాటక పరీక్షా ప్రాధికార నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీఈటీ)లో పాల్గొనే విద్యార్థులకోసం దరఖాస్తుల ప్రక్రియ బుధవారం ఆరంభమైంది. సీఈటీ పరీక్షల తేదీలను తాజాగా మార్పు చేశారు. గతంలో ఏప్రిల్ 20, 21 తేదీలలో నిర్వహించదలిచారు. కానీ 21న నేషనల్ డిఫెన్స్ అకాడమీ పరీక్ష ఉన్నందున మార్పు చేశారు. ఏప్రిల్ 18నుంచి 20 వరకు సీఈటీ పరీక్షలు కొనసాగించదలిచారు. 18న ఉదయం జీవశాస్త్రం, మధ్యాహ్నం గణితం, 19న ఫిజిక్స్, మధ్యాహ్నం రసాయశాస్త్రం పరీక్షలు జరగనున్నారు. 60 మార్కులకు పరీక్షలు జరుగనున్నాయి. హొరనాడు, గడినాడు కన్నడిగ అభ్యర్థులకు బెంగళూరు, బీదర్, బెళగావి, బళ్ళారి, విజయపుర, మంగళూరు, కేంద్రాలలో కన్నడభాషలో పరీక్షలు జరుగనున్నాయి. సీఈటీ పరీక్షల్లో పాల్గొనదలిచిన ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తుల ప్రక్రియ ఆరంభమైంది. నేచురోపతి, యోగా, బీ-ఫార్మా, ఫార్మా-డి, ద్వితీయసంవత్సరం బీ-ఫార్మా, అగ్రికల్చరల్ కోర్సులు, వెటర్నరీ బీఎస్సీ నర్సింగ్, వైద్యరంగ అనుబంధమైన కోర్సులలో చేరే అభ్యర్థులకు అవకాశం ఉంటుందని కర్ణాటక పరీక్షా ప్రాధికార ప్రకటించింది.

విద్యాసంస్థలకే మీ సేవలు పరిమితం కావాలి

» మురుఘా మఠాధిపతికి హైకోర్టు సూచన

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అధికారం కోసం అంతగా పాకులాట సరికాదని, విద్యాసంస్థలకే మీ సేవలు పరిమితం కావాలని చిత్రదుర్గ శివమూర్తి మురుఘా స్వామిజీకి హైకోర్టు ధర్మాసనం సూచించింది. విద్యార్థులపై లైంగిక దాడులకు సంబంధించి జైలుపాలై విడుదలైన విషయం తెలిసిందే. విద్యాపీఠం అధ్యక్షుడిగా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని, పాలకమండలి డైరెక్టర్ ఆర్ నాగరాజు కోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణలు సాగాయి. చీఫ్ జస్టిస్ పీబీ వరాళె, న్యాయమూర్తి కృష్ణ ఎస్ దీక్షిత్‌ల ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. శివమూర్తి తరపు న్యాయవాదులు విద్యాపీఠానికి సంబంధించి ఎటువంటి నిర్ణయాలు తీసుకోవడం లేదని హామీ ఇచ్చారు. కానీ పిటీషన్‌లో దాఖలైన అంశాలను ప్రస్తావిస్తూ మఠానికి అనుబంధమైన విద్యాపీఠం దినసరి కార్యక్రమాలకు మాత్రమే సేవలు కొసాగాలని స్పష్టం చేసింది. విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది. కేసులో బెయిల్‌నుంచి మాత్రమే బయటకు వచ్చారని, కానీ ఆరోపణలనుంచి పూర్తిగా విముక్తి కాలేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

పీణ్యా ఫ్లైఓవర్‌పై రవాణాకు బ్రేక్...

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిత్యం రద్దీగా ఉండే రోడ్లలో ఒకటైన పీణ్యా ప్రాంతంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రవాణాకు మూడురోజుల పాటు పూర్తిగా నిలిపివేయదలచారు. ఈనెల 16 అర్ధరాత్రి నుంచి 19వ తేదీ దాకా పీణ్యా ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వాహనాల సంచారానికి అనుమతులు ఉండవని నేషనల్‌హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ప్రకటించారు. ఈమేరకు యశ్వంతపుర, పీణ్యా ప్రాంతాలకు చెందిన ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మెజిస్టిక్, యశ్వంతపురల నుంచి ఇదే మార్గంగా నెలమంగల, తుమకూరు, హాసన్ సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళే ప్రధాన రహదారిగా ఉంది. రద్దీని కట్టడి చేసేందుకు పీణ్యా ప్రాంతంలో మెట్రో మార్గానికి దాదాపు అనుబంధంగానే బ్రిడ్జి నిర్మించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నాసిరకంగా ఉందనే కారణంతో గత ఏడాది భారీ వాహనాల సంచారాలను నిలిపివేశారు. ద్విచక్రవాహనాలు, కార్ల వంటి వాటికి మాత్రమే అనుమతులు ఇచ్చారు. తాజాగా బ్రిడ్జి నాణ్యతను పరిశీలించే దిశగా నాలుగురోజుల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

విద్యార్థి దశలో ఎస్ఎస్ఎల్‌సీ కీలకం



శిబిరంలో బీఈఓ తనుజా తదితరులు

బాగేపల్లి, జనవరి 10: విద్యార్థి దశలో ఎస్ఎస్ఎల్‌సీ అనేది కీలక ఘట్టమని ఉత్తమ రీతిలో ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని బీఈఓ తనుజా పిలుపునిచ్చారు. తాలూకాలోని దేవర గుడిపల్లి ఆదర్శ విద్యాలయలో బాగేపల్లి, గుడిబండ తాలూకుపాధ్యాయ పాఠాల రివిజన్‌పై ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ భవిష్యత్తుకు పునాది విద్యార్థిదశలోనే ఉంటుందని నిర్లక్ష్యం తగదన్నారు. సమన్వయ అధికారి వెంకటరామ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు వివిధ రీతులలో సాంకేతిక విధానాలు ఉపయోగించి ప్రతి విద్యార్థి కూడా ఉత్తీర్ణులయ్యేలా చూడాలన్నారు. సైన్సు సబ్జెక్టులో బొమ్మలు గీయడం, సూత్రాలు రాయడం వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సైన్స్ సబ్జెక్టు పర్యవేక్షకులు జమీర్ మాట్లాడుతూ ఈ నెల నుంచి పరీక్షల కోసం ఉపాధ్యాయులు మరింత శ్రమించాలన్నారు. తద్వారా మెరుగైన ఫలితాలు సాధ్యమన్నారు. ఈసీఓలు కేబీ ఆంజనేయరెడ్డి, బాలరాజ్, శిబిరం రీసోర్స్‌సెంటర్ వ్యక్తులు వీ వెంకటేశ్, హమీద్, హరీశ్‌రాజ్ అరసు, ఆదర్శ విశ్వవిద్యాలయం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూఎల్ఐపీ కొనుగోళ్లపై పెరుగుతున్న ఆసక్తి

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను అందుకునేం దుకు పెట్టుబడిదారులు ఈక్విటీ, స్థిర ఆదాయం కల్పించే పాలసీలు, యుఎల్ఐపి వంటి వాటిపై ఆసక్తి కనబర్చుతున్నారని పాలసీ బజార్ డాట్‌కాం అధినేత వివేక్ జైన్ వెల్లడించారు. నగరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నామినీలో ఏర్పడుతున్న సమస్యలు, పాలసీల చెల్లింపులో బ్రేక్ వంటి సవాళ్ళను అధిగమించే దిశలో తమ సంస్థ పరిష్కార మార్గాలు అందిస్తోందన్నారు. ఏదైనా కారణంతో పాలసీ చెల్లింపులో జాప్యం జరిగినా నష్టం వాటిల్లకుండా యులిప్ ఖాతాదారులకు రైడర్ సదుపాయం శ్రీరామరక్షగా ఉంటుందన్నారు. బీమా సదుపాయలను ఎలాంటి ఇబ్బందులు ఆటంకాలు లేకుండా ఖాతాదారులు అందుకునే సదుపాయం కల్పిస్తున్నందున యులిప్‌లో చేరేందుకు అమితాసక్తి చూపుతున్నారన్నారు. యులిప్ బీమా పాలసీ దారులకు గరిష్ఠ ప్రయోజనాలను అందిస్తున్నామని ఆయన వివరించారు.

ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేస్తాం

» కరవే మహిళా నేత అశ్విని

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భాష, నీరు, సరిహద్దు, సంస్కృతి అంశాల కోసం దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్న నారాయణగౌడను కేసుల పేరిట వేధిస్తున్నారని, మేం ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేస్తామని కర్ణాటక రక్షణా వేదిక మహిళా నేత అశ్విని వెల్లడించారు. కరవే అధ్యక్షుడు నారాయణ గౌడకు బెయిల్ లభిస్తే బయటకు వచ్చే సరికే మరో కేసులో ఇరికించి వేధిస్తున్నారని మండిపడ్డారు. నగరంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కన్నడిగులకోసం పోరాటాలు చేసేవారికి రక్షణ లేదా..? అంటూ మండిపడ్డారు. నారాయణగౌడకు 30వ ఏసీఎంఎం కోర్టు నిబంధనల బెయిల్‌ను మంజూరు చేసిందన్నారు. విచారణకు సహకరించాలని సూచించారన్నారు. బయటకు వచ్చే సరికే 2017లో జాతీయ విపత్తుల నిబంధనలు ఉల్లంఘించారనే కేసును తెరపైకి తెచ్చారని, మరోసారి అరెస్టు చేశారన్నారు. పోరాట నేతలపట్ల చిన్నచూపు చూడడం సరికాదన్నారు. సమాజానికి కష్టం వచ్చినప్పుడు ఎదురొడ్డి పోరాడేవారు జైలులో ఉన్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ దౌర్జన్యాలకు భవిష్యత్తులో సమాధానం చెబుతామని, మేం ప్రాంతీయ పార్టీని ఏర్పాటు చేసుకుంటామని సవాల్ విసిరారు.